సాక్షి కామారెడ్డి

ఆదివారం । 7 । జనవరి । 2024

ప్రకృతి ఒడిలో ఆధునిక పర్యాటకం





సండే స్పెషల్

ఆధునిక సమాజంలో తీరికలేకుండా పనుల్లో మునిగిపోతున్నప్పటికీ.. ఏ కొద్దిపాటి సమయం చిక్కినా పచ్చని పల్లెల్లో.. స్వచ్ఛమైన గాలిపీల్చుతూ ఆనందంగా గడపాలని అందరూ కోరుకుంటారు. అయితే వినోదం కోసం అనేక పార్కులు కృత్రిమంగా ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవన్నీ పెద్ద నగరాలు, మెట్రో నగరాల్లోనే ఉంటున్నాయి. ఇందుకు భిన్నంగా మాక్లూర్ మండలం మదన్‌పల్లి శివారులో చుట్టూ కొండలు, పొలాల మధ్య పూర్తి గ్రామీణ ప్రాంతంలో, ఆహ్లాదకర వాతావరణంలో సుభాష్ గార్డెన్స్ పేరిట ఏర్పాటు చేసిన అమ్యూజ్‌మెంట్ పార్క్ అందరినీ అలరిస్తోంది. – సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

- వివరాలు 8లో..

న్యూస్‌రీల్

ఒలింపిక్స్ ట్రయల్స్‌కు జిల్లా క్రీడాకారిణి ఎంపిక



దోమకొండ: దోమకొండకు చెందిన అర్చరీ క్రీడాకారిణి కదిరె సింధూజ పారిస్ ఒలింపిక్స్ ట్రయల్స్‌కు ఎంపికైందని అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. పారిస్ ఒలింపిక్స్ ట్రయల్స్‌తోపాటు వరల్డ్ కప్, ఆసియా కప్ పోటీల ట్రయల్స్‌కూ ఎంపికైందని పేర్కొన్నారు. ఈనెల 10 నుంచి 17వ తేదీవరకు కోల్‌కతాలో జరిగే ట్రయల్స్‌లో సింధూజ పాల్గొంటుందని తెలిపారు. క్రీడాకారిణిని రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు కామినేని అనిల్‌కుమార్, కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

'సత్తాచాటి రాష్ట్రానికి పేరు తీసుకురావాలి'



కామారెడ్డి అర్బన్: జాతీయ స్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు సత్తా చాటి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఈనెల 15న బీహార్ రాష్ట్రంలోని గయాలో నిర్వహించే 58వ జాతీయ స్థాయి క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు జిల్లాకు చెందిన కె.అనిల్, ఎం.ఈశ్వర్, బి.హరిత, బి.అర్చన ఎంపికయ్యారు. వారు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్, రాష్ట్ర టీం మేనేజర్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



కామారెడ్డి టౌన్: మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. శనివారం ఆమె జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో మహిళలతో మాట్లాడారు. అనంతరం బస్సులో ప్రయాణించారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించిందని, త్వరలోనే మిగతా పథకాలూ అందుతాయని పేర్కొన్నారు.

టీజీసెట్ ప్రవేశపరీక్ష పోస్టర్ల ఆవిష్కరణ



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 2024–25కు గాను 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష టీజీసెట్–2024 దరఖాస్తు గడువును ఈనెల 20వరకు పొడిగించారు. శనివారం రాత్రి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చేతుల మీదుగా గురుకుల ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ, ఇతర గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఇందుకోసం ఈనెల 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. పరీక్ష తేదీకి పది రోజుల ముందు నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సన్నబియ్యంతో భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు ఉచితంగా అందజేస్తారన్నారు. ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగా సెలక్షన్స్ ఉంటాయన్నారు. సంస్థ వెబ్‌సైట్ www.tswreis.ac.in ను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారిణి అలివేలు, జిల్లా సమన్వయాధికారి సంగీత, నవీపేట్ ప్రిన్సిపల్ డి.రాగలత తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరాముడి ఆశీర్వాదం తీసుకోవాలి'



అక్షింతలను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే దంపతులు

కామారెడ్డి టౌన్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వీక్షించి, భగవంతుడి ఆశీర్వాదం పొందాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రజలను కోరారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలను శనివారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రతినిధులు యాదిరెడ్డి ఎమ్మెల్యేకు ఆయన ఇంట్లో అందించారు. ఎమ్మెల్యే కేవీఆర్ దంపతులు అక్షింతలను పూజా మందిరంలో ఉంచి పూజలు చేశారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధులతో కేవీఆర్ సమావేశమై 22న నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం కోడూరు హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం హరిజన వాడలో అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కృష్ణ, గోపాల కృష్ణ, గంగారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం

- కౌలాస్ కోటను పర్యాటక ప్రాంతంగా మారుస్తాం
- పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



ఎల్లారం తండాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజాంసాగర్/పిట్లం/పెద్దకొడప్‌గల్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నామని పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఆయన జుక్కల్ మండలంలోని కౌలాస్ కోటను సందర్శించారు. బిచ్కుంద, పిట్లం మండలాల్లోని ఎల్లారంతండా, కుర్తి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో ఎల్లారం తండాకు ఎమ్మెల్యే, ఎంపీ వచ్చిన దాఖలాలు లేవన్నారు. రెవెన్యూ శివారు లేదని, గూగుల్ మ్యాప్‌లో తండా పేరు లేదని ప్రజలు అంటుంటే బాధ కలిగిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, ఆ పార్టీ పదేళ్ల పాలనలో గ్రామాలు, తండాల్లో జరిగిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అందుకే ప్రజలు బీఆర్‌ఎస్‌ను తిరస్కరించి, కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసితీరుతామన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా చేసేందుకు వారి వద్దకే పాలనను తెచ్చామన్నారు. అధికారంలోకి రాగానే రెండు హామీలను అమలు చేశామని, మిగిలిన వాటిని దశలవారీగా అమలు చేస్తామని పేర్కొన్నారు.

ప్రతి కుటుంబానికి గ్యాస్ కనెక్షన్ ఉండాలి

ఆరు గ్యారంటీలలో ఒకటైన గ్యాస్ సబ్సిడీ అర్హులైన ప్రతి కుటుబానికి చేరాలని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతి కుటుంబానికి గ్యాస్ కనెక్షన్ ఉండేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. గ్యాస్ కనెక్షన్‌కోసం ఏజెన్సీలు అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోందని, అలాంటి ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కోట గురించి సీఎంకు వివరిస్తా..

కౌలాస్ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కౌలాస్ కోట ప్రాముఖ్యతను ముఖ్యమంత్రికి వివరిస్తానన్నారు. కోటకు సంబంధించిన ఫొటోల ప్రదర్శనను ఆయన తిలకించారు. మంత్రి వెంట జుక్కల్, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతారావు, సంజీవ్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధూ శర్మ, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, కౌలాస్ కోట వారసులు అనితాసింగ్, అనుకుమార్‌సింగ్, నాయకులు రమేష్‌దేశాయ్, విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, బొడ్ల రాజు తదితరులు ఉన్నారు.



కుర్తిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, నాయకులు

ధనిక రాష్ట్రం అప్పులపాలైంది



కుర్తిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

బీఆర్‌ఎస్ పాలనలో ధనిక రాష్ట్రం అప్పులకుప్పగా మారిందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 30 రోజులు కూడా కాలేదని.. అప్పుడే ప్రభుత్వంపైన ప్రతిపక్ష పార్టీ నాయకుడు కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని, ఇది సిగ్గు చేటని పేర్కొన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు, రూ.లక్ష రుణమాఫీ చేస్తామని తొమ్మిదేళ్ల కింద హామీలిచ్చి నెరవేర్చని దద్దమ్మ కేసీఆర్ అని విమర్శించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పులు రూ. 7 లక్షల కోట్లకు చేరాయని, ఏడాదికి రూ. 40 వేల కోట్లు వడ్డీ కింద కట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసి తీరుతామన్నారు.

'ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలి'



రేరా చైర్మన్‌ను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాలను సాధించాలని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రేరా) రాష్ట్ర చైర్మన్, కామారెడ్డి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి ఎస్.సత్యనారాయణ సూచించారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదన్నారు. కోపతాపాలకు లోను కావొద్దన్నారు. అవకాశాలు లభిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో పైకి రావాలని సూచించారు. తాను కామారెడ్డి కలెక్టర్‌గా ఉన్నప్పుడు కళాశాలలో ఏర్పాటు చేసి న రాశివనాన్ని ఇప్పటికీ చక్కగా నిర్వహిస్తున్నారంటూ కళాశాల యాజమాన్యాన్ని అభి నందించారు. రాశివనంలో తాను నాటిన జమ్మి, ఇతర చెట్లకు నీరుపోశారు. క్రాస్‌కంట్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కళాశాల విద్యార్థి బి.హరితను సన్మానించారు. కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, పీజీ, అకడమిక్ సమన్వయకర్తలు రాజ్‌కుమార్, శంకర్, యూజీసీ కన్వీనర్ గణేష్, అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, లక్ష్మణాచారి, రాములు, రాజగంభీర్‌రావు, మల్సూర్, శ్రీలత, స్వప్న, మానస తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ప్రజాపాలన'

- 'గ్యారంటీ' పథకాలకు దరఖాస్తుల వెల్లువ
- కొనసాగుతున్న అప్లికేషన్‌ల ఆన్‌లైన్ ప్రక్రియ



ఎల్లారంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ

నిజాంసాగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మొదటి విడత ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. జిల్లాలో వివిధ పథకాల కోసం 2,94,799 దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడత కార్యక్రమం గతనెల 28న ప్రారంభమైంది. ప్రతి మండలంలో రోజూ రెండు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు, మూడు మున్సిపాలిటీల పరిధిలోని 80 వార్డులలో కార్యక్రమం కొనసాగింది. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పలుచోట్ల ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఎల్లారం, కుర్తి గ్రామాల్లో ప్రజాపాలన చివరి రోజు కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తోపాటు అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈవో, ఇతర జిల్లా అధికారులు నిత్యం గ్రామాలలో పర్యటించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రజలనుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ అన్ని మండలాలు, బల్దియాలలో వేగంగా కొనసాగుతోంది.

డివిజన్లవారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు..

రెవెన్యూ డివిజన్	దరఖాస్తులు
కామారెడ్డి	1,28,473
ఎల్లారెడ్డి	49,205
బాన్సువాడ	1,17,121
మొత్తం	2,94,799

'ఇది ముమ్మాటికీ ప్రజాప్రభుత్వం'



ఇందిరానగర్ కాలనీలో దరఖాస్తుల వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్/మాచారెడ్డి/భిక్కనూరు/బీబీపేట: ఇది ముమ్మాటికీ ప్రజా ప్రభుత్వ మని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట, ఇందిరానగర్, బర్కత్‌పురా కాలనీలలో ప ర్యటించి, ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మాచారెడ్డి మండలంలోని సర్దాపూర్‌తండా, ఎల్లంపేట, బీబీపేట మండల కేంద్రం, భిక్కనూరు మండలంలోని అంతంపల్లి గ్రామాలలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో ఆయన మాట్లాడుతూ నెల రోజుల వయసు కూడా లేని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్ పెద్ద 420 అని ఆరోపించారు. తొమ్మిదేళ్లలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వని ఘనత బీఆర్‌ఎస్‌కు దక్కిందన్నారు. తాము పేదలకు పంచిన భూములను కూడా గత పాలకులు లాక్కున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దొరల, నియంత పాలన పోయి ఇందిరమ్మ పాలన వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో అన్ని పథకాలను అమలు చేసి తీరుతామన్నారు. గత పాలకులలా కాకుండా పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమాలలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, భిక్కనూరు ఎంపీపీ గాలిరెడ్డి, అంతంపల్లి సర్పంచ్ మధుమోహన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు చిట్టెడి సుధాకర్‌రెడ్డి, భీంరెడ్డి, బల్యాల సుదర్శన్, పున్న గంగయ్య, నర్సింలు, సిద్ధరాములు, బాబు, సుతారి రమేష్, భూమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ సుగుణ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ పడిగె సుగుణ శనివారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ కూతకు వేళాయె..!

- నేడు కామారెడ్డిలో జాతీయస్థాయి కబడ్డీ టోర్నీ ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వహణ కమిటీ
- ప్రారంభించనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



ఏర్పాట్లను పరిశీలించి వివరాలు తెలుపుతున్న పోటీల ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారంనుంచి అండర్–17 జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ ప్రారంభం కానుంది. సాయంత్రం నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, కల్చరల్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారు. పోటీల నిర్వహణకు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. 28 రాష్ట్రాలకు చెందిన కబడ్డీ జట్లు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. రైలు, బస్సు మార్గాలలో వచ్చిన క్రీడాకారులకు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. 450 మంది క్రీడాకారులతోపాటు వారి కోచ్‌లు, మేనేజర్లు, హెచ్‌వోడీలకు స్థానిక మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో బస ఏర్పాటు చేశారు. మైదానంలో ఏర్పాట్లను డీఈవో ఎస్.రాజు పరిశీలించారు. కాగా మైనారిటీ రెసిడెన్షియల్ భవనంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు బాగాలేవని తెలిసింది. వసతి ఏర్పాట్లపై పలువురు క్రీడాకారులు, కోచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. షెడ్యూల్ కంటే ముందే జట్లు కామారెడ్డికి చేరుకోవడంతో కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయని, లోపాలను సవరించి, మెరుగైన వసతులు కల్పించామని క్రీడల నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

గ్రూపులవారీగా..

టోర్నీలో పాల్గొంటున్న జట్లను డ్రా పద్ధతిన ఏ నుంచి హెచ్ వరకు ఎనిమిది గ్రూపులుగా విభజించి, పోటీల షెడ్యూల్ రూపొందించారు. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. 11వ తేదీన ఫైనల్ మ్యాచ్‌తో పాటు ముగింపు కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఏ గ్రూప్ : హర్యానా, గుజరాత్, ఆంధ్రప్రదేశ్,
బీ గ్రూప్ : రాజస్తాన్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్
సీ గ్రూప్ : బీహార్, పంజాబ్, సీఐఎస్‌సీఈ
డీ గ్రూప్ : కేవీఎస్, ఒడిషా, చండీఘర్
ఈ గ్రూప్ : కేరళ, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర
ఎఫ్ గ్రూప్ : హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, కర్ణాటక, సీబీఎస్‌ఈడబ్ల్యూఎస్‌వో
జీ గ్రూప్ : తెలంగాణ, వెస్ట్‌బెంగాల్, ఉత్తరాఖండ్, విద్యాభారతి
హెచ్ గ్రూప్ : ఎన్‌వీఎస్, ఢిల్లీ, తమిళనాడు, పాండిచ్చేరి.



క్లుప్తంగా

నూతన చట్టాలపై అవగాహన



కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా కోర్టు సముదాయ భవనంలో నూతన చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి శనివారం కామారెడ్డి జిల్లా కోర్టు భవన సముదాయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్‌లకు నూతన చట్టాలపై అధికారులు అవగాహన కల్పించారు. సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ అశోక్ శివరాం నాయక్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్ గోపాల్ గౌడ్, నంద రమేశ్, నిమ్మ దామోదర్ రెడ్డి, శేషు, కామారెడ్డి డీఎస్పీ ప్రకాశ్, కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్, భిక్కనూరు సీఐ తిరుపయ్య, ఎస్సైలు, ఎక్సైజ్ అధికారులు, కోర్టు లైసెనింగ్ ఆఫీసర్స్ శ్రీరాం, హన్మాండ్లు, విఠల్, కోర్టు కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎల్లారెడ్డి: జాతీయ స్థాయి పరుగుపందెం పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఈశ్వర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి బీహార్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థి ఈశ్వర్‌ను అధ్యాపకులు ప్రభాకర్, కృష్ణప్రసాద్, సిద్ధు, గంగారెడ్డి,వసంతలక్ష్మి పాల్గొన్నారు.

శరత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



లింగంపేట: మండలంలోని బాణాపూర్ గ్రామానికి చెందిన శరత్‌రెడ్డికి డాక్టరేట్‌ను శ్రీరామానంద తీర్థ మరఠ్వాడ యూనివర్సిటీ నాందేడ్ వారు ప్రదానం చేశారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శరత్‌రెడ్డి పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు శరత్‌రెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు.

ప్రకృతి ఒడిలో ఆధునిక పర్యాటకం

- మాక్లూర్ మండలం మదన్‌పల్లిలో 45 ఎకరాల్లో ఫ్యామిలీ టూర్ జోన్
- చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదాన్ని పంచుతున్న వాటర్ గేమ్స్
- ఉత్తర తెలంగాణలోనే ఏకైక వాటర్ గేమ్స్ జోన్
- ఆగ్రో టూరిజం కోసం ఫామ్ స్కూల్ ఏర్పాటుకు ప్రయత్నం : కేసరి శ్రీనివాసరెడ్డి



చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన వాటర్ గేమ్స్

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి కరీంగనర్, ఉమ్మడి ఆదిలాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలకు చెందిన అనేక పాఠశాలల విద్యార్థులకు, చిన్నారులకు, కుటుంబాలకు సుభాష్ గార్డెన్స్ ఆహ్లాదం పంచుతోంది. ఫ్యామిలీ టూర్ జోన్ మాదిరిగానూ ఉంది. నిజామాబాద్‌కు చెందిన కేసరి శ్రీనివాసరెడ్డి, స్వప్నరెడ్డి దంపతులు 2001 నుంచి నగరంలో సుభాష్ హెల్త్ క్లబ్ పేరిట జిమ్, స్విమ్మింగ్‌పూల్ నిర్వహిస్తున్నారు. అయితే నగరానికి దూరంగా అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేసేందుకు గాను 2003లో మదన్‌పల్లి వద్ద 45 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇందు లో మామిడి తోటలు, మలబారు వేప చెట్లు, సపోటా చెట్లు వేశారు. తరువాత వాటర్ గేమ్స్ కోసం వాటర్ స్లైడ్స్, డ్రై స్లైడ్స్, టవర్ స్లై డ్స్, ఫ్యా మిలీ ప్లే స్టేషన్, మల్టీలేన్ రైసర్ స్లైడ్స్ ఏర్పా టు చేశారు. అదేవిధంగా చిన్నా రులు ఆడుకునేందుకు పార్కు లు, ప్లే జోన్స్ ఏర్పాటు చేశారు. అయితే ఇందులో చిన్నారులతో పాటు పెద్దలు కూడా చిన్నపిల్లల మాదిరిగా మారిపోయి సేదతీరుతున్నారు. చుట్టూ కొండలు, పొలాలు ఉండడంతో ఇక్కడ వాతావరణం మరింత ఆహ్లాదకరంగా ఉంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో వెజ్ ఆహారం అందిస్తున్నారు.

డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం..

వాటర్ గేమ్స్‌తో కూడిన అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేసే తన డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం శ్రీనివాసరెడ్డి భారీ ఆదాయం ఇస్తున్న తన వ్యవసాయాన్ని వదులుకున్నారు. ఈ భూమిలో శ్రీనివాసరెడ్డి 2007 నుంచి 2010 వరకు 'డే బ్లూమింగ్ జాస్మిన్' మొక్కలను సాగు చేసి యూరప్, ఫిలిప్పిన్స్ దేశాలకు ఎగుమతి చేశారు. సోరియాసిస్ వ్యాధికి మెడిసిన్ తయారు చేసేందుకు ఈ మొక్కలు ముడిసరుకుగా ఉపయోగపడతాయి. 20 ఎకరాల్లో ఈసాగు ద్వారా రూ.1.5 కోట్ల ఆదాయం ఆర్జించారు. అదేవిధంగా ఏటా 50 వేల బ్యాగుల వర్మి కంపోస్ట్ తయారు చేసి విక్రయించారు. అయితే తన డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం లాభదాయక వ్య వసాయాన్ని శ్రీనివాసరెడ్డి వదులుకున్నారు. ఇక ప్రస్తుతం ఇందులో ఉన్న మామిడి చెట్ల నుంచి ఏటా 80 టన్నుల కాయలు ఆర్గానిక్ విధానంలో పండిస్తున్నారు. మలబారు వేప చెట్లను మొదటి కటింగ్ చేశారు.

ఎడ్యుటైన్‌మెంట్ కోసం..



విద్యార్థుల కోసం భవిష్యత్తులో ఇక్కడ ఆగ్రో టూరిజం.. ఫామ్ స్కూల్ ఏర్పాటు చేసి వినోదంతో కూడిన విద్యను అందించేందుకు గాను 'ఎడ్యుటైన్‌మెంట్' ప్రాజెక్ట్ కోసం ముందుకు వెళ్తున్నాం. అదేవిధంగా జలాశయాల్లో మాదిరిగా సేఫ్ జోన్‌లో ఇక్కడే స్పీడ్ బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇక్కడికి ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాల నుంచి ఇప్పటివరకు 250కి పైగా పాఠశాలల విద్యార్థులు వచ్చి వెళ్తున్నారు. అదేవిధంగా బాసర సరస్వతి ఆలయానికి బస్సుల్లో వచ్చిన వారు సైతం మా గార్డెన్స్‌కు వస్తున్నారు.

– శ్రీనివాస రెడ్డి

ఘనంగా కవి సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేసి కవి సమ్మేళనం ప్రారంభిస్తున్న అతిథులు, కవులు

దోమకొండ: దోమకొండలోని గడీకోటలో శనివారం కవి సమ్మేళనం నిర్వహించారు. గడీకోట ట్రస్టు ఆధ్వర్యంలో తెలుగు సాహితీ అభ్యున్నతికి తెలంగాణ సంస్థానాల వారి సేవ పేరుతో దీనిని ఏర్పాటు చేయగా, తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కవులు, రచయితలు పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడి కిషన్ రావు, చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ జయరామిరెడ్డి, తదితరులు మాట్లాడారు. తెలంగాణ ప్రాంతాన్ని గతంలో పాలించిన సంస్థానాలు వారి పాలనలో తెలుగు భాషకు ఇచ్చిన ప్రాధాన్యతను వివరించారు. దోమకొండ సంస్థానం వారసులు సైతం తెలుగు కవులకు గుర్తింపు ఇచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా చిన్నారుల కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రెరా చైర్మన్ సత్యనారాయణ, వక్తలు ఏనుగు నర్సింహారెడ్డి, ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి, విశ్రాంత ఉపన్యాసకులు వెంకటేశ్వరాచార్యులు, దక్కన్ కల్చరల్ రిసెర్చ్ కేంద్రం డైరెక్టర్ కుర్ర జితేంద్రబాబు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచ్య భాషావిభాగం పూర్వ పీఠాధిపతి అనంతకుమార్‌శర్మ, ఆయాచితం నటేశ్వరశర్మ, మామిడి హరికృష్ణ, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, గడీకోట వారసులు కామినేని అనిల్‌కుమార్, ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి



క్లాత్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన లైఫ్ స్టైల్ ఫర్ ఇన్వోవెంట్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని చెప్పారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటం కోసం విద్యార్థులు మొక్కలు నాటాలని సూచించారు.

ఈ సందర్భంగా క్లాత్ బ్యాగులను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. కంపోస్ట్ ఎరువుల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో డీఈవో రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధరాం రెడ్డి, ఎన్జీసీ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, రాష్ట్ర కోఆర్డినేటర్ శివకుమార్, రిసోర్స్ పర్సన్‌లు ప్రవీణ్ కుమార్, శ్రీధర్, ఎన్జీపీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మార్క్‌ఫెడ్ చైర్మన్



డొంకేశ్వర్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, జీఎం విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై సస్పెన్షన్ వేటు

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న చెరుకూరి ఆనంద్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎడపల్లి సబ్ డివిజన్ ఆపరేషన్ ఏడీ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మద్యం మత్తులో విధులు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలడంతో నివేదికను ఉన్నతాధికారులకు పంపగా బోధన్ డీఈ ముక్తార్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారని వివరించారు. గత నెల డిసెంబర్ 31న తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్ పరిధిలోని బాగేపల్లిలో లైన్‌మెన్ మురళీ ఫోన్ ద్వారా ఎల్‌సీ(లైన్‌క్లియర్) తీసుకుని రైతుల సూచన మేరకు కాశాపూర్ శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను హెల్పర్‌ల సాయంతో బిగిస్తుండగా ఆపరేటర్ ఆనంద్ మద్యం మత్తులో బ్రేకర్‌ను చాలు చేయడంతో విద్యుత్ సరఫరా అయి పెద్ద ప్రమాదం తప్పిందని వివరించారు. స్థానిక రైతులు ఆపరేటర్‌కు ఫోన్ చేసి విషయాన్ని ప్రశ్నించగా మద్యం మత్తులో ఉన్న ఆపరేటర్ దురుసుగా సమాధానం చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందించినట్లు పేర్కొన్నారు. విధులపై అలసత్వం వహించే ఆపరేటర్‌లను ఉపేక్షించేదిలేదని ఏడీ లక్ష్మణ్‌నాయక్ హెచ్చరించారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందుకున్న హాస్టల్ బాలికలు..

సుభాష్‌నగర్ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తరపున సంబంధిత అధికారులు శనివారం దుప్పట్లు అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచేలా దుప్పట్లు, నోట్ బుక్కులు అందించాలని కలెక్టర్ చేసిన విజ్ఞప్తికి అనూహ్య స్పందన లభించిన విషయం విదితమే. ఈమేరకు బోధన్‌లోని ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్, నిజామాబాద్, రెంజల్, డిచ్‌పల్లి, ఆర్మూర్ బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు, అర్గుల్ బీసీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు అందజేశామని జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమేష్ తెలిపారు. అలాగే నోట్ బుక్కులు, పెన్నులను పదోతరగతి విద్యార్థులకు అందజేయనున్నామన్నారు.

మహిళా ప్రజాప్రతినిధులకు దక్కని గౌరవం



చిన్నరాంపూర్ గ్రామసభలో సర్పంచ్‌కు బదులు హాజరైన ఆమెభర్త

బాన్సువాడ రూరల్: ప్రజాపాలన సదస్సులను పలువురు ప్రజాప్రతినిధులు అపహాస్యం చేస్తున్నారు. ప్రజాపాలన గ్రామసభలకు మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి భర్త, కుమారులు హాజరయ్యారు. శనివారం చిన్న రాంపూర్, బోర్లంక్యాంపులో గ్రామసభలు జరిగాయి. సభలకు సర్పంచ్‌లు ఈశ్వరీరేఖకు బదులు ఆమె భర్త శ్రీనివాస్‌రెడ్డి, నాన్కుబాయి బదులు భర్త పీర్యానాయక్ హాజరయ్యారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

లింగంపేట: మండలంలోని కొర్పోల్ గ్రామానికి చెందిన గాండ్ల ఆంజనేయులు(42) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ శనివారం తెలిపారు. ఆంజనేయులు వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు అప్పు చేశాడు. కొంత కాలంగా అప్పులు ఎలా తీర్చాలో తెలియక బాధపడుతూ ఉండేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసి పడుకున్నారు. ఉదయం భార్య కృష్ణవేణి లేచి చూడగా పశువుల కొట్టంలో దూలానికి వేలాడుతూ కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు రాహుల్, కుమార్తె నవ్య ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..

రుద్రూర్: మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నీరేశ్ శనివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మెహిరే వినయ్ కుమార్(34) ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వినయ్‌కు కొన్ని రోజులుగా మద్యానికి అలవాటుపడ్డాడు. శుక్రవారం రాత్రి సైతం మద్యం తాగి గదిలో నిద్రించాడు. శనివారం మధ్యాహ్నం వరకు డోరు తీయకపోవడంతో అనుమానం వచ్చి పగులగొట్టి చూడగా వినయ్ ఉరేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని శివాలయం, రామాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించినట్లు ఎస్సై శనివారం తెలిపారు. హుండీలను తెరిచేందుకు ప్రయత్నించినా తెరువక పోవడంతో వెనుదిరిగారు. ఆలయంలో ఎలాంటి నగదు, ఆభరణలు చోరీకి గురికాలేవన్నారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరుగురి హత్య కేసులో సీన్ రీకన్‌స్ట్రక్షన్

ఖలీల్‌వాడి: మాక్లూర్ మండల కేంద్రంలోని మంగళి ప్రసాద్ హత్య కేసులో ప్రధాన నిందితుడితోపాటు మరో ముగ్గురితో పోలీసులు సీన్‌రీకన్‌స్ట్రక్షన్ శనివారం నిర్వహించారు. హత్య చేసిన ప్రాంతాలను పరిశీలించారు. నిందితులు ఉపయోగించిన గడ్డపార, పార తదితర వస్తువులు కొనుగోలు చేసిన షాపులోకి తీసుకెళ్లి విచారించారు. ఆరుగురు ఒకే కుటుంబానికి చెందిన హత్య చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.

అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడి అరెస్టు..?

ఖలీల్‌వాడి: నగరంలోని అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టుచేసి విచారిస్తున్నట్లు సమాచారం. నగరంలో ఓ పీఎస్‌లో నిందితుడిని అరెస్టుచేసి పెద్ద ఎత్తున మట్కాకు సంబంధించిన డబ్బుతో పాటు చిట్టీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సదరు నిర్వాహకుడితో ఆన్‌లైన్‌లో మట్కా ఆడినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ విషయమై సంబంధిత ఎస్సై, సీఐలను వివరణ కోరడానికి ప్రయత్నించగా వారు స్పందించలేదు. గతంలో కూడా ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ నిర్వాహకుడిని పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినప్పటికీ సీఐతో పాటు ఎస్సై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా చూశారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



రెంజల్: మండలంలోని నీలా పెద్ద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పొక్లెయిన్ సీజ్



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేటలోని ఏడు తూముల చెరువు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీతో పాటు రెండు టిప్పర్లను శనివారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ జయంతిరెడ్డి తెలిపారు. గతంలో హెచ్చరించినా మళ్లీ మొరం తరలిస్తుండడంతో వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏఎస్సై జగదీశ్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.

వీడీసీ సభ్యులపై కేసు నమోదు

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి గ్రామ కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. రజక కులస్తుల భూమిని వీడీసీకి ఇవ్వాలని లేకుంటే బహిష్కరిస్తామని బెదిరించడంతో 15 మంది వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులను వీడీసీలు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

8న ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 8న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ తెలిపారు. డిగ్రీ, ఎంబీఏ, బీటెక్, బీఫార్మసీ, ఐటీఐ డిప్లొమా ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. వేతనం రూ.15 వేల నుంచి 25 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ ఉంటుందన్నారు. వయోపరిమితి 18 ఏళ్ల నుంచి 30లోపు ఉండాలన్నారు. శివాజీనగర్‌లోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఉద్యోగమేళాలో పాల్గొనాలన్నారు. వివరాలకు 95817 68413, 99487 48428, 99487 48428, 99594 56793 ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్ తొలగింపు



నిజామాబాద్ అర్బన్: జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆరుట్ల రాజేశ్వర్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రంథాల చైర్మన్లను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయగా అందులో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కూడా ఉన్నారు. ఈయన 28 నెలల పాటు గ్రంథాలయ చైర్మన్‌గా కొనసాగుతూ వచ్చారు.

క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ రాష్ట్ర జట్టు మేనేజర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్

కామారెడ్డి అర్బన్: బిహార్‌లో ఈనెల 15 నుంచి నిర్వహించే జాతీయ స్థాయి క్రాస్ కంట్రి చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టు మేనేజర్‌గా రాజంపేట మండలం కొండాపూర్ ఉన్నత పాఠశాల పీఈటీ శ్రీనివాస్ ఎంపికయ్యారు. అనంతరం శ్రీనివాస్‌ను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ అభినందనలు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలపై దాడి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ: పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయుడు మత బోధన చేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం బీజేపీ, ఏబీవీపీ, భజరంగ్‌దళ్ నాయకులు స్కూల్‌పై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఇంటికి వచ్చి మా పాఠశాలలో మత బోధన చేస్తున్నారని విద్యార్థి తన తండ్రికి చెప్పడంతో విద్యార్థి తండ్రి వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో బీజేపీ, ఏబీవీపీ, భజరంగ్ దళ్‌కు చెందిన పలువురు పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ మహేందర్‌రెడ్డి ఆందోళన చేస్తున్న వారిని పంపించారు. పాఠశాలపై దాడి చేసిన వారిపై స్కూల్ హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బొలేరో బోల్తా

- ప్రమాదంలో ఒకరి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు



మాచారెడ్డి: ఓ స్కూటీని వెనుక నుంచి ఢీ కొని తప్పించే క్రమంలో బొలేరో వాహనం బోల్తాపడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని పాల్వంచ మర్రి వద్ద చోటు శనివారం చేసుకొంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన రాజేశ్వర్ ఆయన కూతురు అక్షితలు ఇటీవల కొనుగోలు చేసిన స్కూటీకి చుక్కాపూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో పూజ చేయించుకుని కామారెడ్డికి వెళ్తున్నారు. అదే సమయంలో ఓ బొలేరో వాహనం వెనుకనుంచి స్కూటీని ఢీకొన్నది. దీంతో కిందపడ్డ తండ్రి కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. బొలేరో డ్రైవర్ సతీశ్ అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో భవానిపేట వైపు వాహనాన్ని వేగంగా నడిపాడు. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సతీశ్ పక్క సీట్లో కూర్చున్న యూపీకి చెందిన నిగ్ పాల్(40) అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి భాను ప్రకాశ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.